క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్‌ఎస్ పనుల్లో భాగంగా మండలంలోని బాదినేనిపల్లె, సూరవారిపల్లె, బొద్దువానిపల్లె, రామావారిపల్లె, మొట్టుపల్లె, బెడుసుపల్లె, గుంతపల్లె, పోసుపల్లె, బ్రాహ్మణపల్లె, యర్రపల్లె గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుగా ఏఈ తెలిపారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

రాచర్లలో...

రాచర్ల: మండలంలోని విద్యుత్ సాంకేతిక మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లుగా డీఈ బీవై.శేషగిరిరావు, రాచర్ల ఏఈ బాలగురవయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమలవీడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామాపురం గ్రామ సమీపంలోని 11 కేవీ ఫీడరు పరిధిలోని గ్రామాలైన ఓబుల్‌రెడ్డిపల్లె, పాలకవీడు, శీలంవెంకటరెడ్డిపల్లె, సోమిదేవిపల్లె గ్రామాల్లో ఆదివారం 7 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు వెలుగొండస్వామి ఆలయం మూసివేత

కొనకనమిట్ల: చంద్ర గ్రహణం సందర్భంగా నేడు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండలోని వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి శ్రీవారి దర్శనం నిలిపేస్తారన్నారు. తిరిగి సోమవారం ఉదయం 6 గంటలకు ఆలయ సంప్రోక్షణ అనంతరం భక్తులకు శ్రీవారి దర్శనం కలిపిస్తామని ఈఓ తెలిపారు.

ఘనంగా వెంకటేశ్వరుడికి పూజలు

అర్ధవీడు: మండలంలోని కాకర్ల గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. అనంతరం వెంకటేశ్వరుడికి పూల పానుపు సేవ చేశారు.

పాఠశాలలు, అంగన్‌వాడీల్లో గురుపూజోత్సవం



కేజీబీవీలో ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కొనకనమిట్ల: మండలంలోని అన్నీ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో గురుపూజోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయా చోట్ల నిర్వహించిన వేడుకల్లో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు, కార్యకర్తలు, ఆయాలు ఆటల, పాటల పోటీలు నిర్వహించారు. గొట్లగట్టు కేజీబీవీ పాఠశాలలో జరిగిన వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.


లక్ష్మీ చెన్నకేశవునికి శాంతి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో ఉభయదేవేరులతో స్వామివారు

మార్కాపురం టౌన్: శ్రీదేవి భూదేవి సమేతుడైన లక్ష్మీచెన్నకేశవస్వామివారి శాంతి కల్యాణాన్ని శనివారం స్వామివారి మధ్యరంగ మండపంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయ దేవేరులతో కలిసి స్వామివారిని వివిధ రకాల పూలతో, ఆభరణాలతో అలంకరించిన అనంతరం ఉభయదాతలు పట్టు వస్త్రాలు సమర్పించగా ప్రధాన అర్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం



హెచ్‌ఎం దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తర్లుపాడు: రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా అవార్డు అందుకున్న తర్లుపాడు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ముత్తోజు సుధాకర్‌ను పాఠశాల సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉన్నతికి ఆయన చేసిన సేవలను ఉపాధ్యాయులు కొనియాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు గ్రామస్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

కొమరోలుపై ఆర్టీసీ చిన్నచూపు

- కానరాని పల్లెవెలుగు బస్సులు
- నామమాత్రంగా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు
- గంటల తరబడి వేచి ఉంటున్న ప్రయాణికులు
- ఉచిత బస్సు ప్రయాణానికి దూరంగా మహిళలు



అల్లినగరంలో ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ రాస్తారోకో చేస్తున్న ప్రజలు (ఫైల్)

కొమరోలు: మండలంలో సరైన ఆర్టీసీ బస్సులు నడవకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సామాన్యులకు ఉండాల్సిన పల్లెవెలుగు సర్వీసులు ఒకటో, అరో నడుస్తుండడం, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను అంతంతమాత్రంగా నడుపుతూ ఉండడంతో మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణానికి వారు నోచుకోవడం లేదు.

గిద్దలూరుకు ఒకటే సర్వీసు:

కొమరోలు నుంచి నియోజకవర్గ కేంద్రమైన గిద్దలూరుకు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. కానీ కొమరోలు, గిద్దలూరుకు ఒక షటిల్ సర్వీసును మాత్రమే అధికారులు నడుపుతుండడంతో గంటలపాటు ప్రయాణికులు, విద్యార్థులు ఆర్టీసీ బస్టాండ్ల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో కొమరోలు నుంచి పోసుపల్లె, రెడ్డిచెర్ల, తిమ్మారెడ్డిపల్లె, శింగరపల్లె, కోనపల్లె గ్రామాలకు సరిపడేలా సర్వీసులు నడిచేవి.. ప్రస్తుతం ఆ సర్వీసులను కూడా కుదించడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గిద్దలూరు ఆర్టీసీ డిపో పరిధిలో ఉన్న కొమరోలుకు ఒకటి, రెండు సర్వీసులు తప్పించి ఆర్టీసీ అధికారులు బస్సులు నడుపడం లేదు.

ఇతర జిల్లాల సర్వీసులే దిక్కు

గిద్దలూరు ఆర్టీసీ డిపో నుంచి కొమరోలు–గిద్దలూరు షటిల్ సర్వీసు, కోనపల్లె, రెడ్డిచెర్ల, హైదరాబాద్ (సూపర్ లగ్జరీ) తప్పించి ఎలాంటి సర్వీసులు లేవు. ఉన్న సర్వీసులు కూడా ప్రయాణికులకు సరిపడా లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను వినియోగిస్తున్నారు. కడప, బద్వేల్, మైదుకూరు, పులివెందుల, రాయచోటి, వైజాగ్, విజయవాడ ఆర్టీసీ డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్, సూపర్‌లగ్జరీ సర్వీసులు గుంటూరు, విజయవాడ, శ్రీశైలానికి వెళ్తుండడంతో ఆ సర్వీసులనే ఇక్కడి ప్రయాణికులు వినియోగించుకుంటున్నారు.

కొమరోలు నుంచి అల్లినగరం, తాటిచెర్లమోటుకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాలని మండలంలోని పల్లె ప్రజలు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గిద్దలూరు నుంచి వయా కలసపాడు మీదుగా పోరుమామిళ్లకు షటిల్ సర్వీసులు నడుపుతున్నట్లుగా గిద్దలూరు నుంచి వయా తాటిచెర్లమోటు, కొమరోలు మీదుగా పోరుమామిళ్లకు షటిల్ సర్వీసులను నడిపితే తాటిచెర్లమోటు, నల్లగుంట్ల, పొట్టిపల్లె, అక్కపల్లె, ఎస్.బొంతపల్లె, అయ్యవారిపల్లె, కత్తులవానిపల్లె, ఎర్రపల్లె, బ్రాహ్మణపల్లె, మదవపల్లె, అల్లినగరం, యర్రగుంట్ల గ్రామాల ప్రజలకు, విద్యార్థులకు ప్రయోజనం ఉంటుంది.

బస్సును నడపాలంటూ ధర్నా చేసిన ప్రజలు

మండలంలోని అల్లినగరం గ్రామానికి గిద్దలూరు నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతూ అల్లినగరం గ్రామప్రజలు నెలరోజుల క్రితం రాస్తారోకో నిర్వహించారు. ప్రతి పనికి కొమరోలు, గిద్దలూరు వెళ్లాల్సి వస్తోందని, అల్లినగరం గ్రామానికి ఒక్క ఆర్టీసీ బస్సు కూడా లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొమరోలు మండలానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు కొత్తవి కేటాయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చెత్త సృష్టి కేంద్రమా.. ఎంపీడీఓ కార్యాలయమా?



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న చెట్ల కొమ్మలు, వ్యర్థాలు

మార్కాపురం: గ్రామ పంచాయతీలకు ఆదర్శంగా ఉండాల్సిన ఎంపీడీఓ కార్యాలయం చెత్త సృష్టి కేంద్రంగా మారిందని వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు విమర్శిస్తున్నారు. డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం 21 గ్రామ పంచాయతీలకు ప్రధాన కార్యాలయంగా ఉంది. ఇక్కడి నుంచే ఎంపీడీఓ, ఇతర సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు. డివిజన్ కేంద్రం కావడంతో వివిధ గ్రామ పంచాయతీల నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులు, ప్రజలు వివిధ పనుల నిమిత్తం ప్రతిరోజూ వస్తుంటారు. సుమారు 15 రోజుల నుంచి కార్యాలయ ఆవరణలో చెత్త నిండిపోయింది. కార్యాలయంలో ఉన్న కొన్ని చెట్లు, వాటి కొమ్మలు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించారు. ఆ వ్యర్థాలన్నీ కార్యాలయ ప్రాంగణంలోనే ఉన్నాయి. 15 రోజుల నుంచి తొలగించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు తడిసి, నీరు నిలిచి దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన ఎంపీడీఓ కార్యాలయం వ్యర్థాలతో ఉండటంపై పలువురు సర్పంచ్‌లు విమర్శిస్తున్నారు. పరిశుభ్రత పాటించాల్సిన కార్యాలయమే ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సర్పంచ్‌లకు, కార్యదర్శులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించే కార్యాలయమే ఇలా ఉండటంపై పలువురు ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

మార్కాపురం టౌన్: విద్యార్థినులు ఇంటి నుంచి బయటకు వచ్చిన తరువాత అప్రమత్తంగా ఉండాలని సీడీపీఓ పద్మావతి అన్నారు. మండలంలోని వేములకోట జెడ్పీ హైస్కూల్‌లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్త్రీలపై జరిగే అఘాయిత్యాలపై మిషన్ శక్తికి సంబంధించిన సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలకు వచ్చి వెళ్లే సమయంలో, ఇతర పనుల నిమిత్తం బయటకు వచ్చినప్పుడు ఎవరైనా ఇబ్బంది పెడితే వెంటనే తల్లిదండ్రులకు, పోలీసులకు పాఠశాల ఉపాధ్యాయులకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణకుమారి, సఖీ లీగల్ కౌన్సిలర్ స్పందన, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు



నగదు అందజేస్తున్న స్పందన ఫౌండేషన్ కో ఆర్డినేటర్

కొనకనమిట్ల: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభ పరీక్షల్లో మెరిట్ సాధించిన గొట్లగట్టు జెడ్పీ పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహక నగదును శనివారం అందించారు. ప్రతిభ చూపిన విద్యార్థులు కే కౌశిక్, కే పద్మతేజ తల్లులకు స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోఆర్డినేటర్ కోనంకి సంజీవరావు చెరో రూ.10 వేల చొప్పున నగదు అందజేశారు. సంజీవరావు మాట్లాడుతూ కొన్నేళ్లుగా స్పందన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కూనం అంజిరెడ్డి సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల చదువుల కోసం సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆదినారాయణ పాల్గొన్నారు.

భక్తి పరవశం..

- కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో శనీశ్వరునికి తైలాభిషేకం



శనీశ్వరునికి భక్తుల పూజలు

కొనకనమిట్ల: కొనకనమిట్ల సమీపంలోని రామదూత క్షేత్రం శనీశ్వరుని ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనీశ్వరునికి తైలాభిషేకం నిర్వహించారు. రామదూత క్షేత్ర నిర్వాహకులు వేదపండితులు అకళంకం వెంకట రామకృష్ణాచార్యులు శనీశ్వరునికి అష్టోత్తర శత కలశతిలాభిషేకం, అలంకరణ, శాంతి హోమాలు జరిపించారు. ఉభయదాత ఒద్దుల చలమారెడ్డి శనీశ్వరునికి 101 కేజీల నువ్వుల నూనె సమర్పించగా భక్తులు శనీశ్వరునికి తైలాభిషేకం చేశారు. అనంతరం హోమం జరిపించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు యక్కంటి తిరుపతిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చలమారెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి..

భాద్రపద మాసం చతుర్థి శనివారం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి, పోలేరమ్మ తల్లి ఆలయాల్లో, కొనకనమిట్ల రామదూత క్షేత్రం శనీశ్వరుని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు సింహాద్రీ చార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలి

రాచర్ల: ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు పాటించాలని అనుమలవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రమేష్ అన్నారు. మండలంలోని అనుమలవీడు బీసీ బాలుర వసతి గృహంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వాటికి సంబంధించిన మందులు పంపిణీ చేశారు. ఎలాంటి జ్వరాలు వచ్చినా వెంటనే అనుమలవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకుని మందులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ ఎస్.మురళి, సూపర్‌వైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

కంభం: విద్యుత్ సంస్థల్లో మూడో పార్టీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఏపీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షుడు రత్నాకర్ ప్రభుత్వాన్ని కోరారు. ఏఈసీఈఏ ఆధ్వర్యంలో శనివారం కంభంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో మూడో పార్టీ విధానం రద్దయినట్లయితే ఏపీలోను రద్దు చేస్తామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కోర్టు తీర్పులు, కార్మిక చట్టాలు అమలు చేసి 25 వేల కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో అన్నెం వెంకటేశ్వర్లు, ఎం.ప్రసాద్, కొత్తపల్లి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో పశువైద్యశాల



పెచ్చులూడిన పశువైద్యశాల భవనం



ప్రహరీలేని పశువైద్యశాల

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్లలోని పశు వైద్యశాలలో సరైన వసతులు లేక ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యశాల భవనం ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. పైన పెచ్చులూడి చువ్వలు కనిపిస్తున్నాయి. దీంతో పాటు పశు వైద్యశాల చుట్టూ ప్రహరీ లేకపోవటంతో అపరిశుభ్రత నెలకొంది. వైద్యశాలలో సిబ్బందికి అవసరమైన మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే గోడలు నాని ఉరుస్తున్నాయి. శిథిల భవనంలో పశు వైద్యులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. స్లాబ్ కారుతుండటంతో గదిలో ఉన్న రికార్డులు తడిసిపోయే అవకాశం ఉంది. శిథిలావస్థలో ఉన్న పశు వైద్యశాల మరమ్మతులకు కనీసం నిధులు ప్రభుత్వం మంజూరు చేయలేదు. పశువైద్యశాలలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులకు తెలిపామని పశు వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు.

వలంటీర్ విధులను బహిష్కరిస్తున్నాం



ఎంపీడీఓకు వినతిపత్రం అందచేస్తున్న విలేజ్ వార్డ్ సెక్రటరీలు

బేస్తవారిపేట: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవ సమస్యకు కారణమవుతున్న వలంటీర్ విధులను బహిష్కరిస్తున్నట్లు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక నాయకులు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి ఎంపీడీఓ ఏవీ రంగనాయకులుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో ప్రాణ వాయువులాంటి సచివాలయ ఉద్యోగుల శక్తిని నిర్వీర్యం చేసేలా అధికార వర్గాలు చేస్తున్నాయని, రోజు రోజుకూ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని మరింత దిగజారుస్తూ ప్రవర్తిస్తున్న తీరు తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. వలంటీర్ ఒక క్లస్టర్‌కు పరిమితమై నిర్వహించిన విధులను నేడు సచివాలయ ఉద్యోగులను ఎక్కువ క్లస్టర్లకు మ్యాప్ చేసి ప్రతి ఇంటికీ బలవంతంగా తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

స్వామిత్వ సర్వేతో అవస్థలు

గ్రామాల్లో నిర్వహించే స్వామిత్వ సర్వే కొలతలతో ఇబ్బందులు పడుతున్నామని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. సర్వేలో సర్వేయర్ పాత్ర కీలకమైనప్పటికీ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తో చేయిస్తున్నారని వాపోయారు.

కూటమి పాలనలో రైతాంగం కుదేలు



పోస్టర్ ఆవిష్కరణలో మాట్లాడుతున్న ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి

బేస్తవారిపేట: కూటమి పాలనలో రైతాంగం కుదేలైందని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఈనెల 9వ తేదీ నిర్వహించే 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' కార్యక్రమం పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ లేదు, పండించిన పంటలకు మద్దతు ధర లేదు, అనేక ఆంక్షలతో చాలామంది రైతులకు రైతు భరోసా అందించలేదు, ఈ–క్రాప్ బుకింగ్‌లో అలసత్వం, మిర్చి, పొగాకు, పత్తి పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారన్నారు. గత ఐదేళ్లలో ఏనాడూ లేని విధంగా యూరియా కొరతతో రైతులు భయపడుతున్నారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర ఉందని, ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చెల్లించిందని, పంటలు నష్టపోతే ఏ సీజన్‌కు ఆ సీజన్‌లో నష్టపరిహారం అందించారని గుర్తుచేశారు. ఈనెల 9వ తేదీన మార్కాపురంలో జరిగే అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికంగా పాల్గొని ప్రభుత్వం కళ్లు తెరిపించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆవుల శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, అర్ధవీడు మాజీ ఎంపీపీ రవికుమార్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నా భాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్, యూత్ వింగ్ కన్వీనర్‌లు మల్లెల శేఖర్‌రెడ్డి, మాచర్ల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు పెరుమారెడ్డి ఈశ్వరరెడ్డి, బారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, బాలరంగయ్య, క్రిష్టారెడ్డి, మారుతిప్రసాద్ పాల్గొన్నారు.

అన్నదాత పోరు పోస్టర్ల ఆవిష్కరణ

కంభం: రైతులకు ఎరువులను అందించడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ ఈనెల 9న మార్కాపురంలో చేపట్టనున్న 'అన్నదాత పోరు' కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు గొంగటి చెన్నారెడ్డి కోరారు. శనివారం సాయంత్రం కంభంలో పోస్టర్ల ఆవిష్కరణ చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్టేట్ మైనారిటీసెల్ సెక్రటరీ గఫార్ అలిఖాన్, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, రసూల్, మహబూబ్‌పీరా, కోటేశ్వరరావు, సూర్యప్రకాష్, సబ్బసాని సాంబశివారెడ్డి, సలీం, హుస్సేన్‌బాష, రఫి, గురుమూర్తి, ఆనంద్, సురేష్, పోతిరెడ్డి, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.



కంభంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

రైతుల పక్షాన పోరాడుతాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి

గిద్దలూరు రూరల్:

యూరియా ఎరువుల కోసం రైతులు పడే ఇబ్బందులను ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువుల కొరతపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్నదాతలకు అండగా అన్నదాతపోరు కార్యక్రమాలు చేపడుతున్నామని, అందులో భాగంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈ నెల 9వ తేదీ అన్నదాతపోరు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. గిద్దలూరు మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు అన్నదాతపోరు కార్యక్రమంలో పాల్గొని రైతులకు అండగా నిలబడాలన్నారు. రైతుల పక్షాన పోరాడే ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గిద్దలూరు మండల కన్వీనర్ బత్తెం ఓబులరావు, మున్సిపాలిటీ అధ్యక్షుడు మానం బాలిరెడ్డి, నాయకులు పాలుగుళ్ల నరసింహారెడ్డి, పోలేపల్లె శివ, ఈదుల పాండురంగారెడ్డి, కర్ర శివకోటిరెడ్డి పాల్గొన్నారు.